# జూన్ 2 నుంచి రెవెన్యూ సదస్సులు

- **అధికారులకు స్పష్టమైన ఆదేశాలు**
- **ఆహార భద్రత కార్డుల పంపిణీ ప్రక్రియ వేగవంతం..**
- **సాదా బైనామాలు, విరాసత్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి..**

**శెనార్తి మీడియా, మంచిర్యాల**

భూసంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టం కింద దరఖాస్తుల పరిశీలనకు అధికారులు సిద్ధమవుతున్నారని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం లక్షెట్టిపేట తహశిల్దార్ కార్యాలయంలో భూభారతి, కొత్త ఆహార భద్రత కార్డుల ప్రక్రియలను తహశిల్దార్ దిలీప్ కుమార్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జూన్ 2వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు ప్రారంభం కానున్న నేపథ్యంలో రికార్డులు సిద్ధంగా ఉంచాలని సూచించారు. కొత్త చట్టం ద్వారా సర్వేలు, రికార్డుల సవరణ, ముటేషన్, విరాసత్ వంటి ప్రక్రియలు తేలికగా జరుగుతాయని పేర్కొన్నారు. సాదా బైనామా దరఖాస్తులు పరిష్కరించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. అర్హులైన పేదలకు ఆహార భద్రత కార్డులు ఇవ్వడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అనంతరం కలెక్టర్ జెండావెంకటాపూర్, బలరావుపేట గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. మద్దతు ధరతో పాటు రూ.500 అదనపు బోనస్ ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు.రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నీరు, నీడ, ఓ.ఆర్.ఎస్., గోనె సంచులు వంటి సదుపాయాలు కల్పించబడుతున్నాయని చెప్పారు. ధాన్యాన్ని మిల్లులకు వేగంగా తరలించేందుకు హమాలీల సర్దుబాటు మరియు నగదు చెల్లింపు వ్యవస్థను మెరుగుపరిచే విధంగా సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**ఇసుక తీసేందుకు నిబంధనల మేరకు అనుమతులు**

జిల్లాలో ఇసుక తీసేందుకు నిబంధనల మేరకు అనుమతులు జారీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ చాంబర్లో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్తో కలిసి జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని చెన్నూర్ మండల కేంద్రంలో ఇసుక తీసేందుకు వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించి నిబంధనలకు లోబడి అనుమతులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో అందిన దరఖాస్తులపై జిల్లా రెవెన్యూ, నీటిపారుదల, భూగర్భ జల, గ్రామీణ నీటి సరఫరా, వ్యవసాయ, మైన్స్ & జియోలజీ, టి.జి.ఎం.డి.సి. శాఖల సమన్వయంతో సమగ్ర విచారణ జరిపి అనుమతి జారీ చేసేందుకు ప్రతిపాదనలు సమర్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ట్రాన్స్ జెండర్లకు గుర్తింపు కార్డులు



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ట్రాన్స్ జెండర్లకు గుర్తింపు కార్డులు, ధృవపత్రాలు పంపిణీ చేయడం జరిగిందని జిల్లా సంక్షేమశాఖ సీనియర్ అసిస్టెంట్ మల్లేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం కోసం అనేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇందులో భాగంగా జిల్లాలో అర్హత గల 7 మంది ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు, ధృవపత్రాలు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ జూనియర్ అసిస్టెంట్ శ్రీరామమూర్తి, ఎఫ్.ఆర్.ఓ. ఎండి. ఫర్జానా బేగం, ట్రాన్స్ జెండర్లు తదితరులు పాల్గొన్నారు.

## వన్ నేషన్ - వన్ ఎలక్షన్ పై చర్చ

**శెనార్తి మీడియా, మంచిర్యాల**




మంచిర్యాల పట్టణంలోని సుచిత్ర ఇన్ హోటల్‌లో వన్ నేషన్ - వన్ ఎలక్షన్ పై అభిప్రాయ సేకరణ చర్చ కార్యక్రమం జరిగింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ మాట్లాడుతూ, దేశంలో అనేక ఎలక్షన్ల కారణంగా ప్రజాధనం వృధా అవుతోందని, పాలనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. వన్ నేషన్ - వన్ ఎలక్షన్ ఏర్పాటుతో దేశ అభివృద్ధికి దోహదం చేకూరుతుందనే ఉద్దేశంతో ప్రధాని నరేంద్ర మోడీ ప్రజల నుంచి, మేధావుల నుంచి, విద్యావంతుల నుంచి అభిప్రాయాలను సేకరించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారని ఆయన తెలిపారు. అతిథిగా పాల్గొన్న ఎర్రబెల్లి రఘునాథ్ మాట్లాడుతూ.. దేశ అభివృద్ధికి వన్ నేషన్ - వన్ ఎలక్షన్ అవసరమని, మోడీ ఆలోచన విధానం దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కన్వీనర్ దుర్గం అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్ తుల ఆంజనేయులు, డాక్టర్ ఎగ్గెన శ్రీనివాస్, అడ్వకేట్ ఆకుల రవీందర్, వ్యాపారవేత్తలు గుండా సుధాకర్, బండిరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం

**శెనార్తి మీడియా, మంచిర్యాల :** జిల్లాలోని మైనార్టీ గురుకుల విద్యా సంస్థలలో ప్రవేశాల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని తన కార్యాలయంలో మైనార్టీ సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి తో కలిసి గోడప్రచార పదార్థాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మైనార్టీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 5వ తరగతి మరియు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరాల్లో ప్రవేశాల కోసం దరఖాస్తుల ప్రక్రియ మొదలైందన్నారు. అర్హత గల మైనార్టీ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని

## భూభారతి చట్టం ద్వారా భూసమస్యల పరిష్కారం

- **జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**శెనార్తి మీడియా, మంచిర్యాల**



ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి నూతన ఆర్.ఓ. ఆర్. చట్టం ద్వారా భూసమస్యల పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని దండేపల్లి మండల తహశిల్దార్ కార్యాలయంలో భూభారతి, నూతన ఆహార భద్రత కార్డుల ప్రక్రియను తహశిల్దార్ సంధ్యారాణితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 2వ తేదీ నుండి నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులకు సంబంధించి రిజిస్టర్లు, రికార్డులు, పూర్తి స్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. నూతన చట్టంలో రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం కల్పించడం జరిగిందని, రిజిస్ట్రేషన్, ముటేషన్ చేసేందుకు ముందు భూముల వివరాలు పూర్తి స్థాయిలో సర్వే చేసి, మ్యాప్ తయారు చేయడం జరుగుతుందని, పెండింగ్ సాదా బైనామా దరఖాస్తులను పరిష్కరించడం జరుగుతుందని, వారసత్వంగా వచ్చిన భూములకు విరాసత్ చేసే ముందు నిర్ణీత కాలంలో సమగ్ర విచారణ చేయడం, సంబంధిత వారసులకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తుతో పాటు రిజిస్టర్డ్ దస్తావేజులు, రెవెన్యూ రికార్డులు జతపరిచినట్లయితే పరిష్కరించేందుకు మరింత అవకాశం ఉంటుందని తెలిపారు. అర్హత గల నిరుపేదలకు ఆహార భద్రత కార్డులు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంతో పాటు కొర్విచెల్మ, నంబాల గ్రామాలలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు 500 రూపాయల అదనపు బోనస్ అందించడం జరుగుతుందని, వరి ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా త్రాగునీరు, నీడ, ఓ.ఆర్.ఎస్. సౌకర్యాలు కల్పించడంతోపాటు అవసరమైన గోనె సంచులు, టార్పాలిన్లను సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ధాన్యం తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలని, అవసరమైన కొనుగోలు కేంద్రాలలో హమాలీలను సమీప కొనుగోలు కేంద్రాల నుండి సర్దుబాటు చేసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించిన రైతులకు రశీదు జారీ చేయాలని, రైతులు, ధాన్యం వివరాలను ట్యాబ్లలో నమోదు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో నగదు జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వర్షాలు ప్రారంభం కాక ముందే వరిధాన్యం కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని, తదనుగుణంగా అధికారులు, నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లర్లు నిర్దేశిత లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలి

**శెనార్తి మీడియా, మంచిర్యాల**



జిల్లాలో కొనుగోలు కేంద్రాల నుంచి కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించిన ధాన్యం లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లాలోని నస్పూర్ లోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళతో కలిసి జిల్లాలోని రైస్ మిల్లర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం రైతుల నుంచి నాణ్యమైన వడ్లు కొనుగోలు చేస్తున్నదని తెలిపారు. ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం కొనుగోలు చేసిన ధాన్యాన్ని జిల్లాలోని రైస్ మిల్లుల సామర్థ్యానికి అనుగుణంగా కేటాయించిన ప్రకారం ధాన్యం తరలించనున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని రైస్ మిల్లర్లు త్వరగా దిగుమతి చేసుకొని వాహనాలను తిరిగి పంపించాలని సూచించారు. రైస్ మిల్లులకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించే దిశగా చర్యలు తీసుకోవాలని, సీఎంఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలని రైస్ మిల్లర్లకు సూచించారు. కార్యక్రమంలో అధికారులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.



## ఏఆర్ కానిస్టేబుళ్లకు పదోన్నతులు



**శెనార్తి మీడియా, మంచిర్యాల/గోదావరిఖని**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏఆర్ కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా, హెడ్ కానిస్టేబుళ్లకు ఏఆర్ ఎస్ఐలుగా పదోన్నతులు కల్పించారు. ఈ సందర్భంగా కమీషనర్ అంబర్ కిషోర్ ఝా కార్యాలయంలో అధికారులకు ర్యాంక్ పదోన్నతి చిహ్నాలను అలంకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. పదోన్నతులు పోలీసు సిబ్బందికి గుర్తింపు, ఉత్సాహం కల్పిస్తాయని, ఎలాంటి రిమార్కులు లేకుండా విధులు నిర్వహించి మరిన్ని పదోన్నతులు సాధించాలని సూచించారు. పదోన్నతితో బాధ్యతలు కూడా పెరుగుతాయని, ప్రజలలో పోలీస్ శాఖపై విశ్వాసాన్ని పెంచే విధంగా క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అడ్మిన్ దామోదర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలి

- **బీఆర్ఎస్ డిమాండ్**



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను అర్హులైన పేదలకు మాత్రమే కేటాయించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మందమర్రి మండల తహసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు రామిడి కుమార్ మాట్లాడుతూ... డబుల్ బెడ్రూం ఇండ్లకు ఆన్లైన్ లో నమోదు చేసుకున్న వాస్తవ అర్హులను గుర్తించి వారికి ఇండ్లు కేటాయించాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా ఇళ్లులేక ఇబ్బందులు పడుతున్న పేదలకు బదులు, ఇళ్లు ఉన్నవారికి, గత ప్రభుత్వ కాలంలో ఇండ్ల పట్టాలు పొందిన వారికి ఈ ప్రభుత్వం ఇళ్లు కేటాయించడం అన్యాయమని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు తమ స్వలాభం కోసం అర్హుల కాని వారి పేర్లను జాబితాలో చేర్చారని ఆరోపించారు. అటువంటి పేర్లను వెంటనే తొలగించాలని, ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలను, అలాగే కొత్తగా అందిన దరఖాస్తులను పరిశీలించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు పోగుల మల్లయ్య, రేవెల్లి ఓదెలు, గడ్డం రాజు, రామిడి లక్ష్మీకాంత్, చంద్రకిరణ్, చంద్రమౌళి, వేముల వెంకటేష్, సతీష్, రవీందర్, మనీ తదితరులు పాల్గొన్నారు.

## మే పుష్పాల మాయలో "ప్రకృతి మిత్ర"



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

మంచిర్యాల జిల్లా నస్పూర్ కలెక్టరేట్ ఏరియాలోని ఎన్.జి.ఓస్ కాలనీలో పర్యావరణ వేత్త, సైకాలజిస్ట్ గుండేటి యోగేశ్వర్ నివాసం "ప్రకృతి మిత్ర"లో అరుదైన మే పుష్పాలు చూడముచ్చటగా వికసిస్తున్నాయి.బాల్ లిల్లీ లేదా బ్లడ్ లిల్లీ అని పిలిచే ఈ పుష్పం శాస్త్రీయ నామం స్కాడోక్సస్ మల్టీఫ్లోరస్. ఎర్రని బంతిలా ఆకర్షించే ఈ పువ్వును భారతదేశంలో "మే పువ్వు" అని అంటారు. ఎండలు అధికంగా ఉన్న మే నెలలో ఇది పూస్తుంది.ఈ మొక్క లిల్లీ జాతికి చెందినదై, దుంపలుగా పెరుగుతుంది. ఒక్క దుంపలో ఒకే పువ్వు పూస్తుంది. పెద్ద పరిమాణంలోని పువ్వు వికసించడానికి దుంప వయస్సు పెరగాలి. మొదటి ఏడాది చిన్న పువ్వు వస్తే, రెండో మూడో సంవత్సరాల్లో పెద్ద పువ్వు వికసిస్తుంది. ఇసుక నేలల్లో బాగా పెరుగుతూ, రోజులో నాలుగు గంటల ఎండ అవసరం ఉంటుంది. ల్యాండ్ స్కేపుల్లో అంచులకు అలంకరించేందుకు, కట్ ఫ్లవర్‌లా వాడేందుకు అనుకూలంగా ఉంటుంది. ఇంటి ఆవరణలో ఇలాంటి అరుదైన పుష్పజాతులను పెంచడం ద్వారా మానసిక ప్రశాంతత, పాజిటివ్ దృక్పథం పెరుగుతాయి. నేను ఈ మొక్కను కేరళలోని ఒక పర్యటనలో సేకరించాను అని యోగేశ్వర్ తెలిపారు.

## నిర్మాణాన్ని వేగవంతం చేయండి

**శెనార్తి మీడియా, మంచిర్యాల:** జిల్లా కేంద్రంలో చేపట్టిన మహిళా భవనం నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాత మంచిర్యాల ప్రాంతంలో మహిళా భవనం నిర్మాణ ప్రదేశాన్ని సందర్శించిన ఆయన, పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మహిళల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూర్చే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ భవనాన్ని నిర్మిస్తున్నందున, పనులు ఆలస్యం కాకుండా వేగవంతంగా చేపట్టాలని తెలిపారు. సంబంధిత అధికారులు, గుత్తేదారులు సమన్వయంతో పని చేసి, నిర్ణీత కాలపట్టికలో భవనాన్ని పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.